క్లుప్తంగా

చెస్ పోటీల్లో కొత్తరెడ్డిపాలెం విద్యార్థిని ప్రతిభ



చేబ్రోలు: మండలంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కుందన మైత్రి నియోజకవర్గ స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికై ంది. పొన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో అండర్– 14 చెస్ పోటీలలో మైత్రి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొందింది. ఆమె చేబ్రోలు మండలం వడ్లమూడి చాణక్య హైస్కూల్‌లో చదువుతోంది. ఈ నెల 18న గుంటూరు జరిగే జిల్లా స్థాయిలో పోటీలలో పొన్నూరు నియోజకవర్గం తరపున పాల్గొననున్నది. ఈ సందర్భంగా ఆమెను ఒలింపిక్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వరరెడ్డి, హైస్కూల్ హెచ్ఎం సీహెచ్. శివరామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

చలపతి అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులతో పాటు అధ్యాపకులకు ఉజ్వల భవిష్యత్తును అందించడం తమ కళాశాల లక్ష్యమని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈదులమూడి శిరీషకు అస్సాంకు చెందిన ఎన్ఐటీఎస్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని చెప్పారు. ఆమె '' డిజైన్ అండ్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ రైస్డ్ బుర్రిడ్ ఆక్సైడ్ ఎస్ఓఐ ఫెర్రో ఎలక్ట్రిక్ గేట్ టన్నెల్ ఫెట్'' అనే విషయంపై పరిశోధన చేసినట్లు చెప్పారు.

నందూరు సర్పంచ్ నాగరాజు మృతి



పొన్నూరు: మండలంలోని నందూరు గ్రామ సర్పంచ్ అక్కి నాగరాజు బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ గ్రామంలోని సర్పంచ్ నివాసంలో భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళపై దాడి : కేసు నమోదు

లక్ష్మీపురం: సహజీవనం చేస్తున్న వ్యక్తి మద్యం మత్తులో రోకలి బండతో మహిళ తలపై బాది తీవ్రంగా గాయపరిచిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండా వెంకటప్పయ్య కాలనీ చెందిన నారాయణమ్మకు అదే ప్రాంతానికి చెందిన సుబ్బరాజుతో 10 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. ఇద్దరు సంతానం ఉన్నారు. అయితే, సుబ్బరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి నారాయణమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే, పని చేసే ప్రదేశంలో రవి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కొంత కాలంగా సహజీవనం చేస్తున్నారు. అయితే, నిత్యం మద్యం తాగి నారాయణమ్మను కొట్టడం, వేధించడం చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పూటుగా తాగి నారాయణమ్మను రోకలి బండతో తలపై మోదడంతో తీవ్ర గాయాలు పాలైంది. స్థానికుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు పొన్నూరు రోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీలో ఓటరు సహాయక శిబిరాన్ని ప్రారంభించినట్లు హైకోర్టు న్యాయవాది గుమ్మా శ్రీనివాస్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అకాడమీ కార్యాలయంలో ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో ఉచితంగా చేపడతామని పేర్కొన్నారు. 2019 మేలోపు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు డిగ్రీ ప్రొవిజినల్, ఫోటో, ఓటరు గుర్తింపు కార్డు, మొబైల్ నంబరు, మెయిల్ ఐడీతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఓటు నమోదు చేయించుకోవచ్చునని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: 11 కేవీ సింహపురి ఫీడర్‌లో విద్యుత్ లైనుల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సింహపురం ఎస్టేట్, జగదాంబ ఎస్టేట్, డంపింగ్ యార్డు, గంగా ఎస్టేట్, పీకలవాగు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిత్తశుద్ధి లేదు.. చెత్త శుద్ధి కాదు !

- గ్రామాల్లో కానరాని స్వచ్ఛత
- చెత్తకు నిలయాలుగా మారిన ప్రధాన రహదారులు
- నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు



నారాకోడూరులో చెత్తాచెదారం



శలపాడులోని వీరనాయకునిపాలెం రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిలో చెత్త

చేబ్రోలు: పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా పరిపాలన సాగిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అమలు జరగడం లేదు. చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో... తెనాలి, పొన్నూరు, గుంటూరు ప్రాంతాలకు రాకపోకలు సాగించటానికి ప్రధాన రహదారి ప్రాంతంలోని నారాకోడూరు జంక్షన్‌లో దీర్ఘకాలంగా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. జిల్లా ఉన్నతాధికారులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ చెత్త తొలగింపులో సిబ్బందికి చిత్తశుద్ధి కొరవడింది. చేబ్రోలు, వడ్లమూడి, వేజండ్ల తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. శలపాడులో డంపింగ్ యార్డులుగా రోడ్డు మార్జిన్‌లను ఉపయోగిస్తుండటంతో ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. చెత్తా చెదారం కోసం సమీపంలోని కోతులు, కుక్కలు చేరుతున్నాయి. రాకపోకలు సాగించే వాహనదారులు, గ్రామస్థులపై దాడి చేస్తూ బెంబేలెత్తిస్తున్నాయి.

రోడ్డు మార్జిన్లే డంపింగ్ యార్డులు

చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో సేకరించిన చెత్తా చెదారాన్ని ప్రధాన రహదారి పక్కనే వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను వడ్లమూడి వెళ్లే రోడ్డు, వీరనాయకునిపాలెంకు వెళ్లే రోడ్డు, సుద్దపల్లి వెళ్లే రోడ్డు మార్జిన్లలో వేయడంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని నారాకోడూరులో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా గుంటూరు వెళ్లే జీబీసీ రహదారి పక్కన వేస్తున్నారు. తెనాలి ప్రధాన రహదారి పక్కన ఉన్న మార్జిన్లే డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి.

జిల్లా కేంద్రం గుంటూరుకు రాకపోకలు సాగించే జీబీసీ రహదారి, పొన్నూరు రోడ్డులో, తెనాలి ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలు, జంతు కళేబరాలు, చెత్తా చెదారాన్ని రోడ్డు మార్జిన్‌లలో వేస్తున్నారు. గ్రామంలోని ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను చెత్త సంపద కేంద్రానికి తరలించకుండా రోడ్డు మార్జిన్‌లనే వినియోగిస్తున్నారు. వీటితో పాటు సమీప ప్రాంతాల్లోని వారు, వ్యాపారులు వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని నిత్యం అక్కడే వేయడంతో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు.



చేబ్రోలు మండలంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

అలంకారప్రాయంగా చెత్త సంపద కేంద్రం

చేబ్రోలు మండలంలోని 13 గ్రామాల పరిధిలో 12 చోట్ల లక్షలాది రూపాయిల వ్యయంతో చెత్త సంపద కేంద్రాలను నిర్మించారు. వాటిని వాడుకలోకి తీసుకురాకపోవటంతో అలంకార ప్రాయంగా మారాయి. గ్రామంలో రిక్షాలు, ట్రాక్టర్లతో తీసుకువచ్చిన చెత్తా చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయటంతో అపరిశుభ్ర వాతవరణం నెలకొంది. చెత్త నుంచి సంపద సృషించటానికి లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం . గ్రామాల్లో సేకరించిన చెత్తా చెదారాన్ని ప్రధాన రహదారి పక్కన వేయకుండా చర్యలు చేపట్టడానికి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తాం. చెత్త సంపద కేంద్రాలను వాడుకలోకి తెస్తాం.

– కె. లలిత, ఎంపీడీఓ

వీవీఐటీలో ఎక్సోషియా 2కే24 ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దేవకుమార్

పెదకాకాని: విద్యార్థులు సాంకేతిక సదస్సులలో పాల్గొనడం ద్వారా పోటీతత్వం, అధునాతన సాంకేతిక విధానాలు అలవడతాయని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ఏపీ స్టేట్ సెంటర్ సెక్రటరీ డాక్టర్ ఎం.ఎల్.ఎస్. దేవకుమార్ తెలిపారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్‌లో రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ఎక్సోషియా 2కే24 బుధవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో బ్లైండ్ ఫోల్డెడ్ సర్క్యూట్, సిగ్నల్ షఫుల్, మిస్టరీ మ్యాచ్, ప్రాజెక్ట్ ఎక్సో సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవకుమార్ సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక సదస్సులలో విజేతలుగా నిలవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలను దక్కించుకోవాలని తెలిపారు. విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు సన్నద్ధం కావాలని సూచించారు. వేడుకల్లో వివిధ సాంకేతిక కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ కె. గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి ఎ. నరేష్ బాబు, సంధానకర్త సీహెచ్. నాగసాయి కళ్యాణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, వ్యవసాయాధికారులు

చేబ్రోలు: రైతులంతా వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని చేబ్రోలు మండల వ్యవసాయ శాఖాధికారి బి. శ్రీనివాసనాయక్ సూచించారు.చేబ్రోలు, వేజండ్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల రైతులతో కలిసి వ్యవసాయాధికారులు క్షేత్ర ప్రదర్శన చేశారు. పంటల సాగుపై రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల వరిలో మానిపండు తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు టిల్ట్, మల్టికేను పిచికారీ చేయాలని సూచించారు. సాగులో పురుగు మందులు, రసాయనిక ఎరువులు తగ్గించాలని చెప్పారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతంతో పాటు ప్రకృతిలో దొరికే వాటిని ఉపయోగించి భూమి, మానవుల ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కె. సునీత, వీఏఏలు ప్రవీణ్, సూర్యప్రకాష్, ఎంపీఈవో భాను, రైతులు పాల్గొన్నారు.

నూరు శాతం హాజరుకు కృషిచేయాలి



కొండపాటూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం విద్యార్థులు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ తెలిపారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమిక(స్పెషల్)పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్

చేబ్రోలు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేబ్రోలు, గుండవరం, గొడవర్రు, నారాకోడూరు, వడ్లమూడి గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. చేబ్రోలు, పాతరెడ్డిపాలెం గ్రామాల్లో సిమెంటు రోడ్లు, నారాకోడూరులో రూ.10 లక్షలు, వడ్లమూడిలో రూ. 10 లక్షలు, రూ.9లక్షలతో మంచి నీటి బోర్లకు, గ్రామాల్లో రూ. 72 లక్షలతో సీసీ రోడ్లకు, డ్రెయిన్లు, మంచినీటి బోర్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో జనసేన పార్టీ సమన్వయకర్త వి. మార్కేండయబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మైలా రామరాజు, జనసేన అధ్యక్షుడు చందు శ్రీరాములు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పొన్నూరులో..

మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి. చంద్రశేఖరరావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోళ్లమూడిపాడులో రూ. 3.5 లక్షలతో, జూపూడిలో రూ. 2.5 లక్షలతో, పచ్చలతాడిపర్రులో రూ. 3 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో స్తంభించిన జన జీవనం



జలమయమైన పొన్నూరు మెయిన్ రోడ్డు

పొన్నూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎడతెరపి లేకుండా బుధవారం కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. డ్రెయిన్లు పొంగిపొర్లడంతో పలు వీధులు జలమయమయ్యాయి. నిడుబ్రోలు, ఆర్టీసీ డిపో, మున్సిపల్ కార్యాలయం, డీవీసీ కాలనీ, ఇటికంపాడు రోడ్డు, ఎరుకలవాడ, 10వ వార్డులోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు పొంగడంతో వీధుల్లో నీరు ఉధృతంగా ప్రవహించింది. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు.

శుద్ధి చేసిన విత్తనాలనే నాటుకోవాలి



ఉప్పలపాడు(కాకుమాను): రబీ సీజన్‌లో శనగ, మొక్కజొన్న సాగుకు సిద్ధపడుతున్న రైతులు శుద్ధి చేసిన విత్తనాలనే విత్తుకోవాలని ఏవో బి.సుధారాణి సూచించారు.పెదనందిపాడు మండలంలోని ఉప్పలపాడు, అన్నవరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ విత్తన శుద్ధి వల్ల తెగుళ్లను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో పర్సు మాయం

నగరంపాలెం: ఆటోలో పర్సు మాయంపై బాధితులు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లా అడవిపాలెం గ్రామానికి చెందిన కట్టా రాములు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆసుపత్రిలో చూయించుకునేందుకు భార్య కోటేశ్వరమ్మ, మనవడు సహాయంతో బుధవారం కొత్తపేట పశువుల ఆసుపత్రి దగ్గర్లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రిలో చూయించుకున్నాక గుంటూరు బస్టాండ్ వెళ్లేందుకు ముగ్గురు ఆటో ఎక్కారు. కొద్ది దూరం వెళ్లాక చక్రాల్లో గాలి లేదని డ్రైవర్ ఆ ముగ్గుర్ని దించేసి, వాయువేగంతో ఉడాయించాడు. ఈలోగా రాములు జేబు చూసుకునేసరికి పర్సు కనిపించలేదు. అందులో బంగారు గొలుసు, రూ.4 వేలు ఉన్నట్లు పోలీసులకు యిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

సంప్రదాయ వంటలను డిజిటలైజ్ చేయాలి



మాట్లాడుతున్న కృష్ణప్రసాద్ పోలిశెట్టి

చేబ్రోలు: విద్యార్థులు అమ్మమ్మల నుంచి సంప్రదాయ వంటలను తెలుసుకుని, వాటిని డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందించాలని తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ జనరల్ మేనేజర్ ఎస్‌వీ కృష్ణప్రసాద్ పోలిశెట్టి తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది '' రైట్ టు ఫుడ్ ఫర్ ఏ బెటర్ లైఫ్ అండ్ బెటర్ ఫ్యూచర్'' అనే ఇతివృత్తంతో జరిపారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలకు ప్రొటీన్‌లు కలిగిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో రెండు తెలుగు రాష్ట్రాలలో 70 సంవత్సరాలకు పైబడిన మహిళలను సంప్రదిస్తే, వారు వివిధ రకాలైన వంటల తయారీ విధానాలను తెలియజేశారని పేర్కొన్నారు.వాటన్నింటినీ డిజిటలైజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అందరూ '' హీట్ అండ్ ఈట్'' కాన్సెప్ట్‌కు అలవాటు పడుతున్నారని, ఈ విధానం వల్ల దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలకు గురవుతారని తెలిపారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని వివిధ రంగాల్లో చోటు చేసుకుంటున్న నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించగలిగిన ప్రతి విద్యార్థి విజయాలను సొంతం చేసుకుంటారని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్, డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తి నష్టం లేకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట సుబ్బారావు

నెహ్రూనగర్: శంకర్ విలాస్ బ్రిడ్జి నాలుగు లైన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయటాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఆస్తి నష్టం లేకుండా నిర్మాణం చేపట్టాలని అరండల్‌పేట, బ్రాడీపేట ఓనర్స్ షాప్ కీపర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మట్టుపల్లి వెంకట సుబ్బారావు ప్రభుత్వాన్ని కోరారు. అరండల్‌పేటలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, దీనివల్ల అరండల్‌పేట, బ్రాడీపేట ప్రాంతాల్లో ప్రైవేటు ఆస్తులు నష్టపోయే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రత్యామ్నాయ పద్ధతుల్లో హైదరాబాద్, విజయవాడనగరాల్లో నిర్మిస్తున్న బ్రిడ్జిల మాదిరిగానే శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. అసోసియేషన్ నాయకుడు ఏడుకొండలు మాట్లాడుతూ అరండల్‌పేట, బ్రాడీపేట పరిధిలో వ్యాపారం చేసుకుంటూ సుమారు నాలుగువేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వలన వీరంతా ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఉందని తెలిపారు. అడ్వకేట్ నడింపల్లి కమలాకాంత్ మాట్లాడుతూ 2016లో కూడా ఇదే విధంగా బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకున్న నేపథ్యంలో వ్యాపారస్తులతో కలిసి హైకోర్టును ఆశ్రయించామని, స్టే విధించిందని తెలిపారు. ఇప్పుడు కూడా ఎవరి అభిప్రాయాలు సేకరించకుండానే బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. ముందుగా నగరంలో ఉన్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తే ఎటువంటి సమస్య ఉండదని, ఆ దిశగా అడుగులు వేయకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వల్ల సమస్య మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి పెమ్మసానిని, అధికారులను కలిసి సమస్యను విన్నవిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అసోసియేషన్ సెక్రటరీ గురుదత్ పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ




చేతులు శుభ్రపరుచుకునే విధానం వివరిస్తున్న అధికారులు

గుంటూరు రూరల్: ప్రతి రోజూ ఆహారం తీసుకునే ముందు ప్రతి ఒక్కరూ చేతులు పరిశుభ్ర పరుచుకోవాలని ఎంపీడీవో బి. శ్రీనివాసరావు విద్యార్థులకు తెలిపారు. మండలంలోని చల్లావారిపాలెంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 7 లక్షలతో అంకిరెడ్డిపాలెం రోడ్డులోగల సాయిబాబా దేవాలయం నుంచి నూతనంగా నిర్మించే సీసీ రోడ్డుకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ గురించి వివరించారు. చేతులు శుభ్రపరుచుకునే ఏడు విధానాలను చిన్నారులకు డీడబ్ల్యూఎస్ జిల్లా కోఆర్డినేటర్ షఫీ వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, పాఠశాల హెచ్ఎం సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ రమేష్, స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ సురేష్, ఈవో ఏ.ఎన్.వి. సత్యానంద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంపై విజిలెన్స్ దాడి

కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరులో రేషన్ దుకాణంపై విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి దాడి నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ వెంకటస్వామి బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన షాపు నంబర్ 30లో నిబంధనలకు విరుద్ధంగా అదనంగా నిత్యావసర సరుకులు ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు దాడి నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. షాపులో బియ్యం 888 కేజీలు, కందిపప్పు 40 కేజీలు అదనంగా ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. అధికారుల నివేదిక ఆధారంగా దుకాణ యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

రంగ స్థల నటులకు సన్మానం



నటులు రత్నారెడ్డి, విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: విద్యావేత్తగా, గాయకుడిగా, నటుడిగా, కళాపోషకునిగా, విశ్వశాంతి ఆర్ట్ అకాడమీ అధ్యక్షునిగా రత్నారెడ్డి విశేష సేవలందించారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం రత్నారెడ్డితో పాటు తెనాలికి చెందిన నటుడు విజయ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ తెనాలికి చెందిన విజయ్‌కుమార్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని నటుడిగా, జానపద కళా రంగనిష్ణాతుడిగా, గాయకుడిగా విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం

అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. హెల్త్ ఎవేర్‌నెస్ అధ్యక్షుడు ఎ.ఇందుశేఖర్ మాట్లాడుతూ 1945లో ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి సంవత్సరం అక్టోబరు 16న ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆహార దినోత్సవం– 2024 సారాంశంగా మెరుగైన జీవితం, మంచి భవిష్యత్తు కోసం ఆహార హక్కుగా నిర్ణయించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో సత్తా చాటిన నగర విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్దన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంగళగిరి మున్సిపల్ స్టేడియంలో ఈనెల 7,8వ తేదీల్లో జరిగిన పోటీల్లో అండర్–9 కేటగిరీ రింగ్ 4,5,6 విభాగాల్లో ఒకటో తరగతి విద్యార్థిని సజ్జల మనస్విని, ఏ.నాట్యశ్రీతోపాటు 5వ తరగతి విద్యార్థి సజ్జల గణేష్ రింగ్ 2,3 రోడ్–1 పోటీల్లో రెండు స్వర్ణ, ఒక రజత పతకాన్ని సాధించినట్లు వివరించారు. విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన కోచ్ ఇమ్రాన్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.